
సాక్షి
బాపట్ల
సోమవారం ౹ 4 ౹ నవంబర్ ౹ 2024



పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునకొండలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. లాంచీస్టేషన్ నుంచి కొండకు వెళ్లిన వారి నుంచి రూ. 41 వేలు సమకూరింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 588 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 9,633 క్యూసెక్కులు వదిలారు.



ఇంద్రకీలాద్రిపై సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది.

సాయం ఆశలు ఆవిరి!

- ప్రకటనకే పరిమితమైన కూటమి సర్కార్
- అమలు కాని అన్నదాత సుఖీభవ హామీ
- రబీ సీజన్ వచ్చినా ఊసే లేని పెట్టుబడి సాయం అందజేత
- నాడు సాగుకు ముందే ఖాతాల్లో నగదు జమ చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం

జిల్లాలో రైతు భరోసా కింద లబ్ధి ఇలా....

నియోజకవర్గం	రైతుల సంఖ్య	నగదు సాయం (రూ.కోట్లలో)
అద్దంకి	47,119	871.93
చీరాల	6,535	121.20
పర్చూరు	43,610	816.13
బాపట్ల	21,947	399.58
వేమూరు	38,025	681.44
రేపల్లె	34,801	624.95
మొత్తం	1,92,037	3,515.24



వరి పొలానికి ఎరువు చల్లుతున్న దృశ్యం

బాపట్ల టౌన్ : ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిని, ఒకటికి రెండుసార్లు నాట్లు వేసి రైతులు ఆర్థికంగా ఈ ఏడాది చితికిపోయారు. పెట్టిన పెట్టుబడులు కూడా రావనే ఆవేదనలో ఉన్నారు. ఎన్నికలకు ముందు ఏడాదికి రూ. 20 వేల చొప్పున రైతులకు సాయం అందిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో అమలైన రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా మార్పు చేసి చేతులు దులుపుకొన్నారు. మరో నెల రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. అప్పటి నుంచి పంట నూర్పిడి వరకు రైతులకు ఒక్కో ఎకరాకు రూ. 10 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంది. గడిచిన ఐదేళ్లలో ఏటా మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని చూసిన రైతులు ప్రస్తుతం కూటమి సర్కారు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సాయం మినహా రాష్ట్ర సర్కారు నుంచి ఒక్క రూపాయి కూడా అందలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భేష్

రైతుల అభ్యున్నతి కోసం జగనన్న ప్రభుత్వం రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాన్ని ప్రకటించింది. ఏటా రైతుకు రూ. 13,500 చొప్పున ఐదేళ్లపాటు అందించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగా మే నెలలో రూ. 7,500, ఖరీఫ్ కోతలు, రబీలో సాగు చేసే రైతులకు ఉపయోగపడేలా అక్టోబర్‌లో రూ. 4 వేలు, సంక్రాంతి సమయంలో జనవరి నెలలో రూ. 2 వేల చొప్పున ఇచ్చారు.

అబద్ధాలే బాబు నైజం



సొంతంగా ఉన్న అర ఎకరంతోపాటు కౌలుకు రెండు ఎకరాలు తీసుకున్నా. జూలైలో పోసిన నారుమడులు ఆగస్టు నాటికి ఏపుగా పెరిగాయి. వర్షానికి అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. మళ్లీ రూ. 30 వేలు ఖర్చుచేసి నాట్లు వేశాం. వారం రోజులకు మళ్లీ వర్షానికి నీట మునిగాయి. దిక్కుతోచక పొలాన్ని వదిలిపెట్టాను. కనీసం ఒక్క రూపాయి కూడా పరిహారం అందించలేదు. ఎకరాకు రూ. 20 వేల పెట్టుబడి సాయం జాడే లేదు. అబద్ధాలు చెప్పడమే చంద్రబాబు నైజం.

– మార్పు మునలయ్య, గణపవరం

నమ్మించి మోసం



ఎకరం మాగాణి పొలం, మరో అర ఎకరం మెట్ట భూమి ఉంది. మాగాణిలో వరి నాట్లు, మెట్ట భూమిలో పూల తోటల సాగు చేస్తాం. ఈ ఏడాది వర్షాల కారణంగా పూలతోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జగనన్న ఐదేళ్ల క్రమం తప్పకుండా ప్రతి ఏడాది రైతు భరోసా సొమ్ము ఖాతాల్లో జమ చేశారు. ఈ ఏడాది నాట్లు వేసిన పొలాలు కోతలకు కూడా వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాయం అందలేదు. నమ్మించి మోసం చేయటం ఆది నుంచి చంద్రబాబుకు అలవాటే.

– పాలిబోయిన అంకిరెడ్డి, తులసీనగర్

ఆదేశాలు రాలేదు



అన్నదాత సుఖీభవ పథకం అమలుపై మాకు ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు పై నుంచి రాలేదు. పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో తెలియాల్సి ఉంది. రైతులకు మూడు దఫాలుగా నగదు అందించే అవకాశం ఉందని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల తర్వాత రైతులకు పూర్తి వివరాలు అందజేస్తాం.

– వై.రామకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

‘అపార్’ కష్టాలు

- కార్డు జారీకి సరిపోలని విద్యార్థుల వ్యక్తిగత వివరాలు
- ఆధార్ కేంద్రాల చుట్టూ విద్యార్థులకు తప్పని ప్రదక్షిణలు



అపార్ ఐడీ కార్డు నమూనా

చినగంజాం: జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా దేశంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి ఒక గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థి వ్యక్తిగత సమాచారం పొందుపరుస్తూ ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరుతో 12 అంకెలతో కార్డు జారీ చేస్తారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి యూడైస్ నంబరు కేటాయించారు. అపార్ నంబర్ కోసం విద్యార్థుల రికార్డుల్లోని వివరాలు, యూడైస్ ఫాంలోని వివరాలు ఆధార్ కార్డుతో సరిపోలే విధంగా చూసుకొని అప్‌లోడ్ చేస్తే అపార్ నంబరు జారీ అవుతుంది.

ఎన్నో అవరోధాలు

అపార్ కార్డుల జారీకి క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులకు పలు అవరోధాలు ఎదురవుతున్నాయి. పాఠశాల రికార్డుల్లోని విద్యార్థి వ్యక్తిగత సమాచారం ఆధార్ కార్డుతో సరిపోలడం లేదు. విద్యార్థి పుట్టిన తేదీ, పేరు, తల్లిదండ్రుల పేర్లు, ఇతర వివరాలు మ్యాచ్ కావడం లేదు. విద్యార్థి ఆధార్ కార్డును మార్చుకోవాల్సి వస్తోంది. ఆధార్ వివరాలు సుమారు 70 శాతం పైగా సరిపోలని పరిస్థితులు ఎదురవుతుండటంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం 1 నుంచి 7 వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అపార్ నంబర్ జారీ తేలికగా పూర్తి అవుతుండగా.. 9, 10 తరగతుల వారికి కష్టతరంగా మారింది. అందుకు కారణం వారంతా రాష్ట్రంలో ఆధార్ కార్డులు జారీ చేయక ముందు జన్మించిన వారు కావడం. కార్డుల జారీ తక్షణం పూర్తి చేయాలని పాఠశాల హెచ్‌ఎంలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. టార్గెట్ మేరకు అపార్ నంబర్ జారీ చేయకుంటే మెమోలు జారీ చేస్తామని చెబుతున్నారు. దీనికి తాము ఎలా బాధ్యులమని హెచ్‌ఎంలు వాపోతున్నారు. పుట్టిన తేదీ, తల్లిదండ్రుల వివరాలను హెచ్‌ఎం యూడైస్ ఫాంలో మార్చే వీలుంటుంది. ఆధార్‌లోని సవరణలను ఆధార్ కేంద్రంలో చేయించుకోవచ్చు. పాఠశాలలో చేరిన సమయంలో నమోదైన వివరాల ప్రకారం హెచ్‌ఎం సర్టిఫికెట్ జారీ చేయడంతో ఆధార్ కేంద్రాల్లో మార్చేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి. ఆధార్ వివరాలను సవరించే బాధ్యత హెచ్‌ఎంకు అప్పగించడం ద్వారా అపార్ జారీ ప్రక్రియ తేలికవుతుంది. పర్చూరు నియోజక వర్గం పరిధిలో ఆరు మండలాలు పర్చూరు, ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, చినగంజాం ఉన్నాయి. ఇక్కడి బడుల్లో 31,330 మంది విద్యార్థులు చదువుతున్నారు. సుమారుగా యాభై శాతం మాత్రమే అపార్ కార్డుల జారీ పూర్తయింది.

జారీలో ఇబ్బందులు



అపార్ కార్డు జారీతో విద్యార్థికి పలు ప్రయోజనాలున్నాయి. పాఠశాల బదిలీ, కళాశాలలో చేరే సమయంలోను ఇది అవసరం. కార్డు జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాఠశాల రికార్డు, యూడైస్ వివరాలు, ఆధార్ వివరాలు సరిపోలడం లేదు. 25 – 40 శాతం మంది విద్యార్థులకు ఈ పరిస్థితి ఉంది.

– బొల్లిముంత అజయ్ బాబు, ఎంఈఓ, చినగంజాం

న్యూస్‌రీల్

బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల ప్రగతికి బాలోత్సవం దోహదపడుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పల్నాడు బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాలోత్సవం –2024 బ్రోచర్‌ను ఆదివారం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ వేర్వేరుగా ఆవిష్కరించారు. డిసెంబర్ 13, 14వ తేదీలలో పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాలలో ఈ వేడుక నిర్వహించనున్నట్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, కట్టా కోటేశ్వరరావు తెలిపారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 65 విభాగాలలో పోటీ పడతారని వివరించారు. గత ఏడాది 175 పాఠశాలల నుంచి 8 వేల మంది హాజరయ్యారని, ఈ సారి 10 వేల మంది వస్తారని భావించి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు, కమిటీ గౌరవాధ్యక్షుడు ఎంఎస్‌ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల: డీఎస్సీ 2024కు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీలోపు బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 10 వ తరగతి మార్కుల లిస్టు, టీటీసీ, టెట్ మార్కుల లిస్టు, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తును 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ‘వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారత అధికారి, బాపట్ల జిల్లా కార్యాలయం’లో అందించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబరు 63093 35544లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా విజిలెన్స్ వారోత్సవాలు



మాచర్ల: కొత్తపల్లి గ్రామంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నాగార్జునసాగర్ 400 కేవీ సబ్‌స్టేషన్ చీఫ్ మేనేజర్ జెల్ల రాము ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ఓరుగంటి చిన్నారెడ్డి మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు విజిలెన్స్‌పై అవగాహన నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. పవర్ గ్రిడ్ మేనేజర్ సుబోధ్‌కాంత్ మాట్లాడుతూ.. ప్రజల్లో చైతన్యం, అవినీతి రహిత సమాజం కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చీఫ్ మేనేజర్ రాము మాట్లాడుతూ.. కల్చర్ ఆఫ్ ఇంటిగ్రిటి ఫర్ నేషన్స్ ప్రాస్పర్టీ–2024 నినాదంతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఎన్‌జీవో సభ్యులు బంగారయ్య, పవర్ గ్రిడ్ సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట



మంగళగిరి: అక్రమంగా రవాణా చేస్తున్న గోవులను పోలీసులు కాపాడారు. జీవాలను గోశాలకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం ... ఆదివారం తెల్లవారుజామున గోవులు తరలిస్తున్న లారీని విధులలో ఉన్న హోంగార్డు అడ్డుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆత్మకూరు వంతెన వద్ద గోవులను తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సురక్షితంగా నరసింహస్వామి గోశాలకు తరలించారు. అక్కడి నిర్వాహకులకు అప్పగించారు. గోవుల అక్రమ రవాణాపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. ఎవరైనా ఇలా గోవులు అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

పరీక్ష ఫీజుకు వేళాయె..

పదో తరగతి వారికి ఈ నెల 11వ తేదీలోపు చెల్లింపునకు అవకాశం

బాపట్ల టౌన్ : పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో నిర్వహించనున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న రెగ్యులర్, ఫెయిలైన అభ్యర్థులు ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం ఫీజులు చెల్లించాలి. ఈ నెల 11వ తేదీలోగా చెల్లించుకోవచ్చు. జిల్లాలో మొత్తం 132 ప్రైవేటు, 200 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేటు బడుల్లో 6,658 మంది, ప్రభుత్వ పాఠశాలల్లో 11,475 మంది వంతున మొత్తం 18,133 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు 11వ తేదీలోగా నామినల్ రోల్స్ పూర్తి చేసిన తర్వాత స్కూల్ లాగిన్‌లో లింక్ ద్వారా మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మాన్యువల్ నామినల్ రోల్స్ (ఎంఎస్‌ఆర్) నేరుగా సంబంధిత డీఈవో కార్యాలయంలో సబ్మిట్ చేయాలి. 12 – 18వ తేదీలోగా రూ. 50, 19 – 25వ తేదీలోగా రూ. 200, 26 – 30వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజును చెల్లించవచ్చు. రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు కలిపి ఫీజు రూ.125 కాగా, ఫెయిలైన వారికి మూడు, అంతకన్నా తక్కువ సబ్జెక్టులకు రూ. 110, ఎక్కువ సబ్జెక్టులకు రూ. 125గా నిర్ణయించారు. వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే విద్యార్థులు అదనంగా మరో రూ.60 చెల్లించాలి. తక్కువ వయసున్న విద్యార్థులు (అండర్ ఏజ్ స్టూడెంట్స్) ఫీజుగా రూ.300 చెల్లించాలి.

అధికంగా వసూలు చేస్తే చర్యలు



ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు మాత్రమే వసూలు చేయాలి. అధికంగా వసూలు చేసినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. చెల్లింపు సమయంలో ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ సూచించిన నిబంధనలు కచ్చితంగా పాటించాలి. నామినల్ రోల్స్ సబ్మిట్ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడ ఏ చిన్న తప్పు దొర్లినా హెచ్‌ఎంలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– శ్రీరామ్ పురుషోత్తమ్, డీఈవో, బాపట్ల జిల్లా

పట్టభద్రులూ మూడు రోజులే గడువు

- కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదుకు చివరి తేదీ 6
- పట్టభద్రుల్లో కొరవడిన అవగాహన
- నామమాత్రంగా దరఖాస్తులు
- అసిస్టేషన్ నిబంధనతో తలనొప్పి



పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయాల్సిన ఫాం–18

ప్రత్తిపాడు: మీరు పట్టభద్రులా.. రానున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలనుకుంటున్నారా..? అయితే సమయం లేదు మిత్రమా.. పట్టభద్రుల ఓటు నమోదుకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. అర్హత ఉండీ ఓటు నమోదుకు దూరంగా ఉన్న వారు వందల సంఖ్యలో ఉన్నారు. కానీ వారు రకరకాల కారణాలతో నమోదుకు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు ప్రత్తిపాడు నియోజకవర్గంలో 3,494 దరఖాస్తులు మాత్రమే అధికారులకు అందాయి. ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు కచ్చితంగా ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి డిగ్రీ లేదా సమానమైన డిప్లమోను పూర్తి చేసి ఉండటంతో పాటు, 2021 నవంబరు ఒకటో తేదీ నాటికి కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఫాం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి ఓటు హక్కుకు సిఫార్సు చేస్తారు.

గెజిటెడ్ సంతకాలు తలనొప్పిగా..

ఓటు నమోదు దరఖాస్తుకు సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్ల(ప్రొవిజినల్స్)పై కచ్చితంగా గెజిటెడ్ అధికారితో సంతకాలు చేయించాల్సి ఉంది. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు నకళ్లు పట్టుకుని గెజిటెడ్ అధికారుల వద్దకు వెళ్లి వారి నుంచి సంతకాలు తీసుకోవడం పట్టభద్రులకు కాస్తంత ఇబ్బందికరంగా మారింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పరిశీలన సమయంలో రకరకాల కారణాలను అధికారులు చూపిస్తుండటంతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. వృత్తిరీత్యా, ఉద్యోగ రీత్యా ఎక్కడెక్కడో స్థిర పడిన పట్టభద్రులు ఆన్‌లైన్‌లో తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. అధికారులు విచారణ సమయంలో నివాసాలను సందర్శించి, దరఖాస్తుదారు ఉంటేనే ఆమోదిస్తామని, చెబుతున్నారు. దీంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా ఫలితం ఉండటం లేదని ఓటర్లు ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఓటు హక్కుకు ఏయే సర్టిఫికెట్లు కావాలో అవగాహన ఉండడం లేదు. డిగ్రీ ప్రొవిజనల్, ఆధార్‌కార్డు, ఫొటో ఉండాలని, ప్రొవిజనల్‌పై గజిటెడ్ అధికారి అసిస్టేషన్ ఉండాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు

https://ceoandhra.nic.in

వెబ్ అడ్రస్‌ను సందర్శించాలి.

వెంటనే దరఖాస్తు చేసుకోండి



పట్టభద్రులు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 6వ తేదీ వరకే సమయం ఉంది. ఇప్పటి వరకూ దరఖాస్తు చేసుకోని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుదారులు విచారణ సమయంలో ఇంటి వద్దే ఉండి అధికారులకు సహకరించాలి.

– జి.కరుణకుమార్, తహసీల్దార్, ప్రత్తిపాడు

నిఘా నీడలో సూర్యలంక తీరం



యాత్రికులతో మాట్లాడుతున్న డీఎస్పీ జి.రామాంజనేయులు

బాపట్ల టౌన్: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని సూర్యలంక తీరానికి చేరుకునే పర్యాటకులు, భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ జి. రామాంజనేయులు తెలిపారు. ఆదివారం తీరంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్తిక పౌర్ణమి రోజున రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే లక్షల మంది పర్యాటకులను దృష్టి ఉంచుకుని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. తీరంలో దొంగలు సంచరించే అవకాశం ఉన్నందున నిరంతరం డ్రోన్‌లతో నిఘా పెట్టామని వెల్లడించారు. కార్తిక పౌర్ణమి ముగిసేంతవరకు మఫ్టీలో పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ శాఖ తరఫున చర్యలు తీసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

సందర్శకుల సందడి



బాపట్ల టౌన్: కార్తిక మాసానికి తోడు ఆదివారం సెలవు కారణంగా సూర్యలంక తీరానికి సందర్శకులు పోటెత్తారు. వేకువ జామునే తీరానికి చేరుకొని సూర్య నమస్కారాలతో స్నానాలను ప్రారంభించారు. పలువురు సాయంత్రం వరకు తీరంలోనే గడిపారు. కుటుంబ సమేతంగా సేద తీరారు. చిన్నారులు, యువకులు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు.

జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అసోసియేషన్ సభ్యులు

బాపట్ల టౌన్: బాపట్ల జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఎన్నికలు శనివారం గుంటూరులోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పాటిబండ్ల విష్ణువర్ధన్, కార్యదర్శిగా కురగంటి రవి, కోశాధికారిగా గుంటుపల్లి భానుచంద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అబ్జర్వర్ గడ్డం సురేష్‌బాబు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి కోచ్ విశ్వనాథ్, జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావులు హాజరై ఎన్నికలు నిర్వహించారు. సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా గుంటుపల్లి హరగోపాల్, లీగల్ సెక్రటరీ మేకా రాహుల్ చౌదరి, టెక్నికల్ కమిటీ కన్వీనర్లుగా తుమ్మల శ్రీనివాస్, దాసరి మనోజ్ నియమితులయ్యారు. అనంతరం పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ బాస్కెట్‌బాల్‌లో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో బాపట్ల జిల్లా ఉండే విధంగా క్రీడను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

కూటమి నేతల కుట్ర రాజకీయం

- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు డైమండ్ బాబు ర్యాలీపై అక్కసు
- ఉద్దేశపూర్వకంగా వీఆర్వోతో ఫిర్యాదు చేయించి కేసు నమోదు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కూటమి నేతలు మరోసారి వైఎస్సార్ సీపీపై అక్కసు వెళ్లగక్కారు. శనివారం వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడిగా వనమా బాలవజ్రబాబు (డైమండ్ బాబు) ప్రమాణస్వీకారం గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మంగళదాస్‌నగర్‌కు ప్రదర్శనగా వెళ్లారు. భారీగా కార్యకర్తలు, ప్రజలు తరలిరావటంతో కూటమి నేతలకు కన్ను కుట్టినట్లుంది. అధికార పార్టీ నేతలు స్థానిక వీఆర్వో మంగమ్మతో బలవంతంగా పాతగుంటూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయించినట్లు తెలుస్తోంది. పోలీసులూ కేసు నమోదు చేశారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారని, ముందస్తు అనుమతులు లేకుండా ర్యాలీ జరిపారని, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఒక మనిషిని ఢీకొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

నష్టపరిహారం ఇవ్వాలి

తాడేపల్లి రూరల్: ఆగస్టులో వరదల ముంపునకు గురై పాడైన ఇంజిన్ ఆయిల్ మోటార్లు, మోటార్ పంపు సెట్లను నమోదు చేసి రైతులకు, కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. పలువురు కౌలు రైతులను కలిసి వరద ముంపుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. హరిబాబు మాట్లాడుతూ రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

తెనాలిరూరల్: ఆటో, కారు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయాలపాలయ్యారు. తెనాలి మండలం నందివెలుగు- అత్తోట గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఆదివారం సాయంత్రం కొల్లిపర వైపు నుంచి వస్తున్న ఆటోను ఎదురుగా మితిమీరిన వేగంతో వస్తున్న కారు ఢీ కొట్టడంతో ఒకే కటుంబానికి చెందిన వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం ప్రకారం.. కొల్లిపరకు చెందిన ఎం.ధన కిషోర్, భార్య దేవరాణి, కుమారుడు, కుమార్తెతో కలిసి ఆదివారం సాయంత్రం శ్రీకాళహస్తి వెళ్లేందుకు తెనాలి రైల్వేస్టేషన్‌కు ఆటోలో బయలుదేరారు. నందివెలుగు పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ఎదురుగా మితిమీరిన వేగంతో వచ్చిన కారు అదుపుతప్పి వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు ధన కిషోర్, దేవరాణి, వీరి కుమారుడు విజయభాను, ఆటో డ్రైవర్ శ్రీధర్‌కు గాయాలయ్యాయి. కిషోర్ కుమార్తె క్షేమంగా బయటపడింది. స్థానికులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. కారు మితిమీరిన వేగంతో వచ్చి తమ ఆటోను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని బాధితులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

- మళయాళ మనోరమ మ్యాగజైన్ అసిస్టెంట్ ఎడిటర్ జేమ్స్ జాకబ్
- వెల్లటూరులో సాగుచేస్తున్న ప్రకృతి సాగు పంటల పరిశీలన



వెల్లటూరులో ప్రకృతి సాగు పొలాన్ని పరిశీలిస్తున్న మళయాళ మనోరమ మ్యాగజైన్ అసిస్టెంట్ ఎడిటర్ జేమ్స్ జాకబ్, బాపట్ల డీపీఎం వాణిశ్రీ

వెల్లటూరు(భట్టిప్రోలు): ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలతో మంచి దిగుబడులతో పాటు అధిక ఆదాయం పొందవచ్చునని మళయాళ మనోరమ మ్యాగజైన్ అసిస్టెంట్ ఎడిటర్ జేమ్స్ జాకబ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయ విధానం, మహిళల పాత్ర, సాగు వలన ఉపయోగాలు, స్వయంగా పరిశీలించి తెలుసుకునేందుకు ఆయన ఆదివారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు వచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ విభాగం(ఏపీసీఎన్ఎఫ్) బాపట్ల జిల్లా డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ ఆయనకు సాగు విధానాన్ని వివరించారు. గ్రామానికి చెందిన జడా నాగరాజు సాగు చేస్తున్న బీర తోటలో అంతర్ పంటగా అరటి, కంద, బి.నాగమల్లేశ్వరరావు సాగు చేస్తున్న బెండ, బీర, ఎ.నాగార్జున అరటిలో అంతర్ పంటగా సాగు చేస్తున్న బీర, ఫార్మర్స్ సైంటిస్ట్ వెంకటేశ్వరనాయక్ సాగు చేస్తున్న వరి, ఐసీఆర్పీగా పని చేస్తున్న కాట్రగడ్డ రేవతి సాగు చేస్తున్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేమ్స్ జాకబ్ మాట్లాడుతూ తమ మ్యాగజైన్ తరఫున పాడి పంట ప్రత్యేక సంచిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా తమ మ్యాగజైన్ కింద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించేందుకు రూ.2 లక్షల బహుమతి అందజేస్తున్నట్లు వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించడమే కాక ఖర్చు తగ్గించుకోవచ్చునని చెప్పారు. వాణిశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తుందని వివరించారు. రైతు సాధికారత సంస్థ ద్వారా జెడ్‌బీఎన్ఎఫ్ కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం జె.మోహన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవో హోం హాల్‌లో ఉద్యమ అధ్యయన తరగతులు ఆదివారం జరిగాయి. చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ఆరు నెలల నుంచి ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలు రూ.కోట్లలో నిలిచాయని పేర్కొన్నారు. వాటిని సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ బకాయిలు, 90 నెలల పెండింగ్ డీఏలను ఎప్పుడు విడుదల చేసేది ప్రభుత్వం చెప్పాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు పనిభారంగా మారిన యాప్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అపార్‌లో వస్తున్న ఇబ్బందులు తొలగించి, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగవరప్రసాద్ పాల్గొన్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



బాలికల విభాగంలో తలపడుతున్న జట్లు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, డీఎస్‌ఏ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానాలలో పోటీలను నిర్వహిస్తున్నారు. గత రెండురోజులుగా జరిగిన పోటీల్లో క్వార్టర్ ఫైనల్‌కు చేరిన జిల్లాల జట్లు వివరాలను స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం ప్రకటించారు. అండర్-14 బాలికల విభాగంలో తూర్పుగోదావరి, కర్నూలు, విశాఖ, అనంతపురం, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణా, చిత్తూరు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడనున్నాయి. అలాగే బాలుర విభాగంలో తూర్పుగోదావరి, చిత్తూరు, విశాఖ, పశ్చిమగోదావరి, అనంతపురం, నెల్లూరు, కృష్ణా, కర్నూలు జట్లు తలపడనున్నాయి. పోటీలకు పరిశీలకునిగా కె.కృష్ణారెడ్డి (పశ్చిమగోదావరి) వ్యవహరిస్తుండగా,వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవిరావు, శ్రీనివాసులు, శివలక్ష్మి, శివపార్వతి, గౌస్ తదితరులు సహకరిస్తున్నారు.

కోటప్పకొండలో రెండు ఆర్వో ప్లాంట్‌లు

- ప్లాంట్‌లు నిర్మించి, నిర్వహణ చేపట్టనున్న దీవిస్ సంస్థ



నరసరావుపేటరూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆలయంలో జలప్రసాదం ద్వారా రక్షిత శుద్ధ జలాలను భక్తులను అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌కు చెందిన దీవిస్ లేబొరేటరీస్ రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో జలప్రసాదం పథకంలో ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా కోటప్పకొండ ఆలయంలో రెండు ఆర్వో ప్లాంట్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆలయ ప్రాంగణంలోని అన్నప్రసాదం వద్ద, పార్కింగ్ వద్ద ఉన్న శ్రీ మేధా దక్షిణామూర్తి విగ్రహం వద్ద రెండు ప్లాంట్‌లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే ప్లాంట్ ఏర్పాటు పనులు సంస్థ ప్రారంభించింది. నెల రోజుల్లో రెండు ప్లాంట్‌లు భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. ఆయా ప్లాంట్‌ల నిర్వాహణ కూడా దీవిస్ సంస్థే చేపట్టనుంది.

గాయపడిన యువకుడు మృతి

అద్దంకి రూరల్: అద్దంకి-నార్కెట్‌పల్లి నామ్ రహదిరిపై అద్దంకి సమీపంలో బైకుతో డివైడర్‌ను ఢీకొట్టి గాయాలపాలైన యువకడు ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రవీణ కేసు నమోదు చేశారు. వివరాలు.. అద్దంకి పట్టణంలోని దామావారి పాలెంకు చెందిన వేముల ప్రసన్నబాబు (39) గత నెల 31వ తేదీ రాత్రి బుల్లెట్ బైకుపై శింగరకొండ నుంచి అద్దంకికి వస్తుండగా మార్గమధ్యంలో కూకట్ల కన్వెన్షన్ వద్దకు రాగానే బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన ప్రసన్నబాబు ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం, భార్య ఫిర్యాదుతో ఎస్సై కేసు నమోదు చేశారు.

విద్యార్థి మృతదేహం వెలికితీత



అద్దంకి రూరల్: అద్దంకిలోని బ్రిడ్జిపై నుంచి గుండ్లకమ్మ నదిలో దూకి శనివారం ఆత్మహత్యకు పాల్పడిన ఇంటర్ విద్యార్థి దాట్ల దుర్గాప్రసాద్(18) మృతదేహాన్ని ఆదివారం వెలికితీశారు. వివరాలు.. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీ 19వ లైన్‌లో నివాసం ఉంటున్న దాట్ల శ్రీనివాసరావు కుమారుడు దాట్లు దుర్గాప్రసాద్ అద్దంకిలోని ప్రయివేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల నుంచి తోటి విద్యార్థులతో కలసి విహారయాత్రకు వెళ్లాలని తల్లిదండ్రులను అడగ్గా వారు వద్దు అన్నారు. దీంతో మనస్తాపానికి గురై గుండ్లకమ్మలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి స్నేహితులు భావిస్తున్నారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది, ఒంగోలు నుంచి వచ్చిన రెస్క్యూటీమ్ ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలించి మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం కోసం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేశారు.

విధి నిర్వహణలో పీహెచ్‌సీ స్టాఫ్‌నర్స్ మృతి



కల్యాణి(ఫైల్)

నాగాయలంక: గ్రామంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్స్(ఎన్‌హెచ్ఎం)గా చేస్తున్న పులివర్తి కల్యాణి(34) విధి నిర్వహణలోనే మృతి చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక పీహెచ్‌సీలో 2021 నుంచి స్టాఫ్‌నర్స్‌గా బాపట్ల జిల్లాకు చెందిన కల్యాణి పని చేస్తున్నారు. ఆమె ఏడాదిగా కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతూ సెలవులో ఉన్నారు. డయాలసిస్ తర్వాత కోలుకున్న ఆమె నెల రోజుల నుంచి ఆస్పత్రి విధులకు వస్తున్నారు. ఈ క్రమంలో నవంబరు 1వ తేదీ రాత్రి షిఫ్ట్ డ్యూటీ చేస్తూ 11 గంటల సమయంలో కుప్పకూలి పడిపోయారు. పీహెచ్‌సీ డాక్టర్ ఇంద్రకుమార్‌రెడ్డి, సిబ్బంది ఆమెను మెరుగైన చికిత్స కోసం అవనిగడ్డ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె తుది శ్వాస విడిచినట్లు వైద్యాధికారి డాక్టర్ కె.శివరామకృష్ణ ధ్రువీకరించారు.

సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీకి పల్నాడు వాసి



సత్తెనపల్లి: జాతీయ స్థాయి సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీకి పల్నాడు జిల్లావాసి ఎంపికైనట్లు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. ఆదివారం సత్తెనపల్లిలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్‌డీటీ క్రీడామైదానంలో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగే జాతీయ స్థాయి సీనియర్ మెన్ సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు గోల్ కీపర్‌గా షేక్ ఇర్ఫాన్ ఎంపికయ్యాడన్నారు. ఇర్ఫాన్‌ను పలువురు అభినందించారు. ఆయనతో పాటు సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ షేక్ మహ్మద్ రియాజ్, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉన్నారు.

బిల్డింగ్‌పై నుంచి జారిపడి కూలీ మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య

అద్దంకి రూరల్: బిల్డింగ్ పైన నున్న వేస్టును కిందకు పోస్తూ ప్రమాదవశాత్తూ జారిపడి కూలీ మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం అద్దంకిలో చోటు చేసుకుంది. మృతుడి భార్య ఫిర్యాదుతో ఎస్సై ఖాదర్‌బాషా కేసు నమోదు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బీసీ బాలుర వసతి గృహం వద్ద నివాసం ఉంటున్న తోమట్ల పవన్ కుమార్ (38) కూలీపనులు చేసుకుంటూ నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం స్థానిక రంగారావు ప్రయివేటు వైద్యశాలలో డాబాపైన వాటర్ ట్యాంక్ పగలకొట్టే పనికి వెళ్లాడు. పనిలో భాగంగా సాయంత్రం వేస్టు డస్ట్‌ను పైనుంచి కింద ఉన్న ట్రాక్టర్‌లోకి పోస్తున్నారు. ఈ క్రమంలో జారి కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భార్య అంజలి అక్కడికి చేరుకుని భోరున విలపించింది.

ఆమె మృత్యువును జయించింది..

- రైలు నుంచి కాలువలోకి దూకిన మహిళ
- రాత్రి నుంచి ఉదయం వరకు చెట్టు తీగలను పట్టుకుని నీటిలోనే
- ఆమెను కాపాడిన కృష్ణలంక పోలీసులు



కాలువలో నుంచి ఒడ్డుకు తీసుకొస్తున్న పోలీసులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మానసిక స్థితి సరిగ్గా లేని ఓ మహిళ రైలు నుంచి బందరు కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం కట్టవ గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, షేక్ జిన్నాతున్నీసా భార్యాభర్తలు. ఖాదర్‌వలి కూలీ పనులకు చేస్తుంటాడు. గత 20 ఏళ్లగా జిన్నాతున్నీసాకు మానసిక స్థితి సరిగ్గా లేదు. ఆమె విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. 20 రోజుల క్రితం ఆమె నిజాంపట్నంలోని పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటోంది. శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సమీపంలోని రైల్వేస్టేషన్‌కు చేరుకుని విజయవాడ వెళ్లే రైలు ఎక్కింది. రాత్రి 9 గంటల సమయంలో ఆ రైలు కృష్ణానది దాటి బందరు కాలువ మీదకు వెళ్లగానే ఆమె కాలువలో దూకేసింది. నీటి ప్రవాహానికి కొట్టుకుపోతూ కాలువ ఒడ్డున ఉన్న చెట్టు తీగలను పట్టుకుని నీటిలో ఉండిపోయింది. ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో కాలువ నుంచి కేకలు వినిపించడంతో స్థానికులు నీటిలో ఉన్న ఆమెను గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కృష్ణలంక పీఎస్ కానిస్టేబుళ్లు వి.నాగేశ్వరరావు, అబ్దుల్ మజీద్ స్థానికులతో కలసి నీటిలో ఉన్న ఆమెకు కొబ్బరి మట్టను అందించి పైకి లాగి ఒడ్డుకు చేర్చారు. వివరాల అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంటనే స్పందించి మహిళ ప్రాణం కాపాడిన సిబ్బంది నాగేశ్వరరావు, అబ్దుల్ మజీద్‌లను సీపీ ఎస్వీ రాజశేఖరబాబు అభినందించారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు

అద్దంకి రూరల్: ఇంటర్ విద్యార్థి తప్పిపోయిన ఘటనపై తండ్రి లాజర్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఖాదర్‌బాషా ఆదివారం కేసు నమోదు చేశారు. శంకవరప్పాడు గ్రామానికి చెందిన గరిగల లాజర్ కుమారుడు లకేష్ శుక్రవారం ఒంగోలులోని పెళ్లూరులోని సరస్వతి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. సుమారు 5 రోజుల కిందట లకేష్‌కు కండ్లకలక వచ్చింది. ఇంటికి వచ్చి తగ్గేవరకు ఇంట్లో ఉన్నాడు. ఈనెల 1వ తేదీన ఉదయం 8 గంటల సమయంలో అద్దంకి బస్టాండ్‌కు బైకుపై వచ్చి ఒంగోలు బస్సు ఎక్కివెళ్లాడు. కాలేజీకి వెళ్లేటప్పుడు ఇంటికి ఫోన్ చేయకపోవటంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చి కళాశాలకు వెళ్లి విచారించగా రాలేదని ప్రిన్సిపాల్ తెలిపారు. బంధువులు, స్నేహితులవద్దకు వెళ్లాడనే ఉద్దేశంతో వెతికినా ఫలితం లేకపోవటంతో అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

వేటపాలెం: మోటార్ బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు కింద పడిన వ్యక్తి మృతి చెందాడు. పందిళ్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. కడవకుదురు చెందిన మురకిపూడి అబ్రహం రోజూ కూలీ పని కోసం చీరాల వెళ్లి వస్తుంటాడు. రోజూ మాదిరిగా వెళ్లి తిరిగి సాయం కాలం ఇంటికి చేరుకున్నాడు. ఆ తరువాత గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో మోటార్ బైక్‌పై పందిళ్లపల్లి వైపు బయలుదేరాడు. మార్గమధ్యంలో మోటార్ బైక్ పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడా లేదా ఏదైనా వాహనం ఢీకొట్టి వెళ్లిందా అనేది తెలియాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వర్లు పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

హోరాహోరీగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



బరువులు ఎత్తుతున్న లిఫ్టరు



విజేతలు జయసాయికృష్ణ, ఎం.పావనితో నిర్వాహకులు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూలులో జరుగుతున్న 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ అంతర జిల్లాల (అండర్-17) బాలబాలికల వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు రెండోరోజైన ఆదివారం కొనసాగాయి. పోటీల్లో 55 కిలోల బాలుర విభాగంలో గుంటూరు జిల్లాకు చెందిన జి.జయసాయికృష్ణ స్నాచ్‌లో 60 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 90 కిలోలతో సహా మొత్తం 150 కిలోలతో ప్రథమ స్థానం సాధించాడు. కడప, విశాఖకు చెందిన లిఫ్టర్లు ద్వితీయ, తృతీయ బహుమతులను గెలిచారు. బాలికల 40 కిలోల విభాగంలో పశ్చిమ గోదావరి, 45 కిలోల విభాగంలో తూర్పుగోదావరి లిఫ్టర్లు ప్రథమస్థానంలో నిలిచారు. ఈ పోటీలకు ఎస్.కోటేశ్వరరావు, సీహెచ్ గోపీనాథ్, ఎ.వెంకటరామిరెడ్డి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగశిరీష, వ్యాయామ అధ్యాపకుడు రమేష్, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఎం.రవికుమార్ పర్యవేక్షించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

- ధరల పెంపుపై నిరసనగా ఈనెల 15న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు శివకుమారి



పార్టీ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నరసరావుపేట: కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వాలు పెరిగిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు డి.శివకుమారి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ శాఖల జనరల్ బాడీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, కూరగాయల విపరీతమైన అధిక ధరల వలన సామాన్య ప్రజల ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల ఎనిమిదో తేదీ నుంచి 15 వరకు ప్రచార కార్యక్రమం, 15వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. అలాగే సీపీఎం ఆధ్వర్యంలో డిసెంబరు ఏడు, ఎనిమిది తేదీల్లో నరసరావుపేటలో నిర్వహించే పార్టీ జిల్లా మొదటి మహాసభల విజయవంతానికి పట్టణ ప్రజలు సహకారం అందజేసి విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పట్టణ ఒన్‌టౌన్, టూటౌన్ కార్యదర్శులు సిలార్ మసూద్ సయ్యద్ రబ్బాని, సీనియర్ నాయకులు ఏవీకే దుర్గారావు, షేక్ మస్తాన్‌వలి, ధూపం సుభాష్ చంద్రబోస్, మిరపకాయల రాంబాబు, కట్ట కోటేశ్వరావు, జిలాని మాలిక్, సభ్యులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



ఎస్టీయూ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

నరసరావుపేట ఈస్ట్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలనీ, లేకుంటే ఉద్యమాలకు సైతం వెనుకాడబోమని ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ కార్యదర్శి, ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు స్పష్టం చేశారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్.వి.రామిరెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశంలో జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే 35 శాతం ఐఆర్ ప్రకటించాలనీ, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ ఎరియర్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం సీపీఎస్ రద్దును వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ 117 జీఓను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని కోరారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం లేకుండా చూడాలన్నారు. ఎస్టీయూ నాయకులు ఎస్.ఎం.సుభాని, జె.గంగాధరబాబు, వెంకటకోటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యకర్తపై టీడీపీ వర్గీయుల దాడి

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో సీపీఎం కార్యకర్తపై టీడీపీ వర్గీయులు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎండ్రాయి గ్రామంలో సీపీఎం కార్యకర్తగా ఉంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వృద్ధుడైన నందూరి వెంకటేశ్వరరాజుపై పాత కక్షల నేపథ్యంలో ఎండ్రాయి మెయిన్ రోడ్డుపై టీడీపీ వర్గీయులు గోరంట్ల నాని, గోరంట్ల నాగమల్లేశ్వరరావు రత్నాకర్ ప్రసాద్‌లు దాడిచేశారు. ఈ సంఘటనపై సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ వయస్సు రీత్యా గౌరవం ఇవ్వకపోగా అకారణంగా అసభ్యపదజాలంతో తిడుతూ రోడ్డు మీద పడేసి కొట్టటం దారుణమన్నారు. అధికారం ఉంది మమ్మల్ని ఎవరు ఏమి చేయలేరు. నిన్నుచంపేస్తామని బాధితుడిని బెదిరించారన్నారు.ఈ సంఘటన పై వెంటనే పోలీసులు కేసు నమోదు చేయాలని నిందితులను అరెస్టు చేయాలన్నారు.